# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ - న్యూజిలాండ్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చలు వియజయవంతమయ్యాయి.
- ❖ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అఖిల భారత సర్వీసు అధికారులు ముఖ్య భూమిక పోషిస్తారని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అన్నారు.
- ❖ ఆరావళి పర్వత శ్రేణుల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రశంసించిందని కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - న్యూజిలాండ్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చలు వియజయవంతమయ్యాయి. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు టెలిఫోన్‌లో మాట్లాడారు. ఇరు దేశాలకు పరస్పరం ప్రయోజనాలు అందించే చరిత్రాత్మకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) విజయవంతంగా పూర్తయిందని నాయకులిద్దరూ సంయుక్తంగా ప్రకటించారు. 2025 మార్చిలో భారత్‌లో ప్రధాని లక్సన్ పర్యటించిన సమయంలో దీనికి సంబంధించిన చర్చలు ప్రారంభమయ్యాయని, రికార్డు స్థాయిలో 9 నెలల్లోనే ఎఫ్‌టీఏ పూర్తయిందని ఇరువురు నాయకులు తెలిపారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను ఈ ఎఫ్‌టీఏ మరింత బలోపేతం చేస్తుందని, మార్కెట్ అవకాశాలను విస్తరిస్తుందని, పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఎఫ్‌టీఏ అందించే బలమైన పునాదితో వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు అవుతుందని, రానున్న 15 ఏళ్లలో న్యూజిలాండ్ నుంచి భారత్‌కు 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయనే విశ్వాసాన్ని నాయకులిద్దరూ వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం న్యూజిలాండ్ దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) రెండు దేశాలకు చెందిన ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, రైతులు, అంకుర సంస్థలు, విద్యార్థులు, యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇరు దేశాల మధ్య ఎఫ్‌టీఏ చర్చలు ఈరోజుతో ముగిశాయి. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ… ఒప్పందం కోసం మొత్తం ఐదు విడతలగా అధికారిక చర్చలు జరిపామని, ఈ ఎఫ్‌టీఏ ఇండో-పసిఫిక్ ప్రాంతంతో భారతదేశపు సంబంధాల అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. న్యూజిలాండ్ అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతల చేరికల ద్వారా దేశీయ పాడి పరిశ్రమ, రైతులకు గణనీయమైన లబ్ది చేకూరుతుందన్నారు. దేశీయ ఎగుమతులు పెరుగుతాయని భారత్-న్యూజిలాండ్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ ఎఫ్‌టీఏ దోహదపడుతుందని పీయూష్ గోయల్ పేర్కొంటూ…

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అఖిల భారత సర్వీసు అధికారులు ముఖ్య భూమిక పోషిస్తారని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అన్నారు. 2023-24 బ్యాచ్ ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ అధికారుల శిక్షణార్థుల సమావేశంలో ఉపరాష్ట్రపతి ఈరోజు న్యూఢిల్లీలో మాట్లాడుతూ… నైతికత, పారదర్శకత, జవాబుదారీగా తత్త్వ ప్రమాణాలను పాటించడం అవసరమని ఉద్ఘాటించారు. ప్రజా నిధులను నిర్ధారించడానికి వివేకపూర్వక ఆర్థిక నిర్వహణ అవసరమని ఉపరాష్ట్రపతి అన్నారు. యువ అధికారులు జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదించిన భారత “పరివర్తన కోసం అణుశక్తి సుస్థిర ఉత్పత్తి అభ్యుదయం” బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ బిల్లు పౌర అణు రంగానికి సంబంధించిన అన్ని చట్టాలను ఏకీకృతం చేస్తుంది. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యానికి కూడా మార్గం సుగమం చేస్తుంది. ఈ చట్టం ప్రభుత్వ లైసెన్సుతో ప్రైవేట్ కంపెనీలు, జాయింట్ వెంచర్లు అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించడానికి, కలిగి ఉండడానికి, నిర్వహించడానికి, మూసివేయడానికి వీలు కల్పిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ మహిళా కమిషన్ “శక్తి స్కాలర్స్ యంగ్ రీసెర్చ్ ఫెలోషిప్” కార్యక్రమాన్ని ప్రారంభించింది. మహిళల భద్రత, గౌరవం, లింగ ఆధారిత హింస, చట్టపరమైన హక్కులు, సైబర్ భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక సాధికారత కార్మిక భాగస్వామ్యం వంటి కీలక రంగాలపై పరిశోధనలను ప్రోత్సహించడం ఈ ఫెలోషిప్ లక్ష్యం. మహిళలను ప్రభావితం చేసే పలు సమస్యలపై విధాన-ఆధారిత పరిశోధనలను చేపట్టడానికి పరిశోధకుల నుండి జాతీయ మహిళా కమిషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. గుర్తింపు పొందిన సంస్థ నుండి గ్రాడ్యుయేషన్ కనీస అర్హత కలిగిన 21 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల పౌరులు ఈ ఫెలోషిప్ కు అర్హులని మహిళా కమిషన్ స్పష్టం చేసింది. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ వరకు తమ దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆరావళి పర్వత శ్రేణుల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీం కోర్టు ప్రశంసించిందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖా మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. ఆరావళి గ్రీన్ వాల్ ప్రాజక్ట్ చొరవను సుప్రీంకోర్టు అభినందించిందని చెప్పారు. న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ… సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు. ఆరావళికి

సంబంధించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ఆపాలని కోరారు. ఆరావళి మొత్తం విస్తీర్ణం ఒక లక్షా 47 వేల చదరపు కిలోమీటర్లు అని, అందులో కేవలం 0.19 శాతం ప్రాంతంలో మాత్రమే మైనింగ్ కు అనుమతి ఉందని స్పష్టం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = =

షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (PESA) చట్టం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో రేపటి నుంచి రెండు రోజుల పాటు పెసా మహోత్సవ్ జరగనుంది. కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహోత్సవంలో పెసా చట్టం పరిధిలోని రాష్ట్రాల నుండి పంచాయతీ ప్రతినిధులు, క్రీడాకారులు, సాంస్కృతిక కళాకారులు కలిపి దాదాపు 2 వేల మంది ప్రతినిధులు పాల్గొంటారని అధికారులు వెల్లడించారు. ఈ మహోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రారంభిస్తారు. కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ తో పాటూ పలువురు కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. 24వ తేదీన "గ్రామ స్వరాజ్య" పేరుతో కార్యశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ మహోత్సవంలో నిర్వహిస్తారు. పెసా చట్టానికి సంబంధించిన పలు జాతీయ కార్యక్రమాలు కూడా అదే రోజున ప్రారంభించబడతాయి. పెసా రాష్ట్రాలకు చెందిన గిరిజనుల సాంస్కృతిక, సాంప్రదాయ వారసత్వాన్ని జరుపుకోవడానికి పెసా మహోత్సవ్ ఒక జాతీయ వేదికగా నిలవనుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 929 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 638 పాయింట్ల లాభంతో 85 వేల 567 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 206 పాయింట్లు లాభంతో 26 వేల 172 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 70 పైసలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 411 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్ శ్రీలంక మహిళల క్రికెట్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో భాగంగా విశాఖపట్నంలో రేపు రెండవ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ విశాఖపట్నంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా సాయంత్రం 7 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సిరీస్ లో భారత్ 1-0 ఆధిత్యలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =